రైతులను దగా చేసిన ఘనుడు చంద్రబాబు


భీమడోలులో మాట్లాడుతున్న ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు


రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న పుప్పాల వాసుబాబు

మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: అన్నదాత సుఖీభవ పథకం హామీతో రైతులను మరోసారి దగా చేసిన ఘనుడు చంద్రబాబు అని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర రాజకీయ సలహా కమిటి సభ్యుడు పుప్పాల వాసుబాబు విమర్శించారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్ నందు శనివారం సాయంత్రం బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు చంద్రబాబు మోసాలపై క్యూ ఆర్ కోడ్ ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అధికారంలో వచ్చిన వెంటనే అమలు చేస్తానని చెప్పి ప్రజలందరికీ బాండ్లు ఇచ్చి గద్దె నెక్కిన తర్వాత వారిని నట్టేట ముంచారన్నారు. ప్రజలను మోసగించి అధికార పీఠం ఎక్కడమే చంద్రబాబు నైజమన్నారు. చంద్రబాబు ఎప్పుడు సింగిల్‌గా పోటీకి రాలేదన్నారు. ఈ సారి ఎన్నికల్లో మూడు పార్టీలతో కలిసి ఎన్నికల్లో నిలిచి గెలిచాడని, వైఎస్సార్ సీపీ సింగిల్‌గా ఎన్నికల్లో నిలబడి 40 శాతం ఓట్లు పొంది రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అన్నదాన సుఖీభవ పథకాన్ని వచ్చిన ఏడాది నుంచి అమలు చేస్తానని చెప్పి రెండో ఏడాది అరకొర నగదును అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులుండగా వారిలో 45 లక్షల మందికి రైతులకు చంద్రబాబు నగదును అందిస్తానని ప్రకటించారని, మిగిలిన 9 లక్షల మంది రైతులను నట్టేట ముంచాడని మండిపడ్డారు. అదీ కూడా ఒకేసారి రూ.20వేల నగదును అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ నిధులతో కలిపి తొలి విడతగా రూ.7 వేలను జమ చేస్తున్నాడని, ఇదీ రైతులను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్న, చిన్నకారులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ రైతులందరికి ప్రతి ఏటా అన్న సమయానికి ఎన్ని కష్టాలున్నా రూ.13500లను రైతుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు.

పవన్ కల్యాణ్ ప్రశ్నించరెందుకు?

సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసిన చంద్రబాబును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఎన్నికల హామీల్లోని ప్రతి హామీని నెరవేర్చే బాధ్యత నాదని, లేకుంటే తల దించుకుంటానని చెప్పారని, ఎక్కడ తలపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని యువతకు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేని పక్షంలో నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నా కూటమి పెద్దలు ఆ హామీకి తిలోదకాలిచ్చారన్నారు. 18 నుంచి 59 ఏళ్ల అక్కాచెల్లెమ్మలకు ప్రతి నెల రూ.1500 ఇస్తామన్నారని, ఆ పథకాన్ని పూర్తిగా బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ పథకాల్లో కేవలం పింఛన్లు తప్ప ఏ పథకం అమలు చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి నెలా పింఛన్‌దారులు ఎందుకు తగ్గిపోతున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకుని వెళ్లేందుకు వైసీపీ శ్రేణులు యుద్ధ సైనికుల్లా పని చేయాలన్నారు. ఎన్నికల హామీల బాండ్లు వారికి ప్రజలకు చూపుతూ ఏ విధంగా మోసగించిందో వారికి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ఈ ఏడాది పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలే తప్ప సుపరిపాలన జాడే లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనుమాల రామయ్య, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మద్దుల రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి కందులపాటి శ్రీనివాసరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, జిల్లా అధికార ప్రతినిధి ఇంజేటి నీలిమ,రైతు విభాగం కన్వీనర్ పసుపులేటి సత్యనారాయణ, పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ రామిశెట్టి శ్రీను, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు చిలువూరి సత్యనారాయణ రాజు, నియోజకవర్గ ఆర్‌టీఐ కన్వీనర్ అంబటి నాగేంద్ర ప్రసాద్, గ్రీవెన్స్ కన్వీనర్ పాము మాన్ సింగ్, నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ ఆజామ్, ఐటీ వింగ్ కన్వీనర్ చిట్టూరి సాయికృష్ణ,సర్పంచులు నీలం శ్రీను, మానుకొండ నాగేశ్వరరావు, వెజ్జు బాలాజీ, ఎంపీటీసీలు గంటా శ్రీనివాసరావు, ఇంజేటి జూనియర్, పొల్నాటి శ్రీను, దాసరి విజయభాను, తోటకూర రామలింగరాజు, ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఏపూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం శ్రీ కోదండ రామాలయంలో శనివారం దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రతిష్ఠించనున్న శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, గణేశ, సుబ్రమణ్య శ్రీకృష్ణ అయ్యప్ప స్వామి వార్ల విగ్రహాలకు శనివారం ప్రత్యేకంగా పూజలు చేశారు. ఉదయం ఈశ్వర పూజ పుణ్యాహవాచనం, పంచగవ్య, ప్రాక్షణ రిత్విక్, వరుణ దీక్ష రాదన, వాస్తు బలి, నవగ్రహ అష్టదిక్పాలక మండపాల ఆరాధన, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రైతుల సంక్షేమానికి కృషి

ఉంగుటూరు: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం స్థానిక శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 20 వేల 95 మంది రైతులు అన్నదాత సుఖీభవ పొందుతున్నారని వివరించారు.

చెరువులో నాచు, తూడు తొలగింపు


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఏసమ్మ

దెందులూరు: గ్రామంలో దళిత పేటలో ఉన్న మంచినీటి చెరువులో తూడు, నాచు తొలగిస్తున్నామని సర్పంచ్ తోట ఏసమ్మ అన్నారు. స్థానికులకు సురక్షితమైన తాగునీరు అందించే ప్రక్రియలో భాగంగా చెరువును ఎండబెట్టామని వివరించారు. చెరువు ఎండిన తర్వాత చెరువులోని తూడు, నాచు తీస్తున్నారని ఇప్పటికే చెరువు గట్టు ఆధునికీకరించామని తెలిపారు. ఈ పనులను శనివారం సర్పంచ్ పరిశీలించారు.

మెరిట్ స్టూడెంట్‌కు ఆర్థిక సాయం

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్లస్‌లో గతేడాది ఎంపీసీ గ్రూపులో ద్వితీయ సంవత్సరం 775 మార్కులు సాధించిన మెరిట్ స్టూడెంట్ సౌమ్యకు డిగ్రీ చదువు నిమిత్తం ఉపాధ్యాయులు శనివారం ఆర్థిక సాయం చేశారు. పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న పురిటిపాటి పల్లారెడ్డి రూ. 5 వేలు, సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న సీఎం భాస్కర్ రూ. 2 వేలు అందించారు. పాఠశాల హెచ్‌ఎం వల్లపట్ల విజయకుమార్ చేతుల మీదుగా విద్యార్థినికి సాయం అందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు గొల్లపూడి వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి


జాతీయ పతాకాలతో ర్యాలీ చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య దూరదృష్టి జాతీయ భావం చరిత్ర ఉన్నంతకాలం నిలిచిపోతాయని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గి శెట్టి నూకరాజు అన్నారు. శనివారం నర్సింగ్ కళాశాలలో జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థినులు జాతీయ పతాకాలు పట్టుకుని న్యూపాటి, ఇంద్రవనం, రెండో వార్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో నర్సింగ్ స్టూడెంట్ లావణ్య పింగళి వెంకయ్య జీవన విధానం గురించి వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్లను ఈనెల 5న ఉదయం 10.30 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ధ్రువీకరణ కోసం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని, సీటు రిజర్వు అయితే ఏడాదికి రూ.4700 చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90102 22162 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

తల్లిపాలతో బిడ్డలకు వ్యాధులు దూరం


భీమడోలు: పోలసానిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఉంగుటూరు: చేబ్రోలు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న బి.సుజాతరాణి


దెందులూరు: తల్లికి పౌష్టికాహారం అందిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని భీమడోలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంఆర్ రూపాదేవి అన్నారు. పోలసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నెం. 14 నందు ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం కేంద్ర పరిధిలోని అంగన్‌వాడీ లబ్ధిదారులకు తల్లి పాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎంఆర్ రూపాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతతుల్యమని, జన్మించిన బిడ్డకు గంటలోపు పాలు పట్టించడం ద్వారా తల్లిబిడ్డల ఆరోగ్యం బాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.రాణి కుమారి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఆర్‌జేడీ బి.సుజాత రాణి అన్నారు. తల్లి పాలు వారోత్సవాలను శనివారం చేబ్రోలు పీహెచ్‌సీలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.బాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆర్‌జేడీ సుజాత రాణి మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ఇస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణరెడ్డి, సర్పంచ్ రందే లక్ష్మీసునీత, కార్యదర్శి శ్రీనివాసు, సూపర్‌వైజర్లు డి.శారదామణి, ఎం.బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ఇస్తుందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పోతునూరులో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం వారు తీసుకోవాల్సిన ఆహారం వ్యాయామం వైద్య పరీక్షలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: 33 కేవీ ఎర్రమళ్ల ఫీడర్ నిర్వహణ పనులు నిర్వహిస్తున్నందున ఉంగుటూరు, చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అందిస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ 11 కేవీ ఫీడర్‌పై మరమ్మతుల నిమిత్తం వ్యవసాయ సంబంధిత 9 గంటల విద్యుత్‌ను ఉదయం మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, మిగిలిన నాలుగు గంటల సరఫరాను మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ మార్పును ఉంగుటూరు, చేబ్రోలు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

దెందులూరు: మండలంలోని వేగవరం గ్రామ శివారు కొత్తపల్లి సపోటా తోటలో శనివారం పేకాట శిబిరంపై పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 51000 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. అనంతరం సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ పెదవేగి పోలీస్ సర్కిల్ పరిధిలో మూడు మండలాల్లో ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగినా, ప్రోత్సహించినా, సహకరించినా అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పెదవేగి: తమ కుమారుడు ఇల్లు వదిలి వెళ్లిపోయాడంటూ తల్లిదండ్రులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన లంకపల్లి రాంబాబు, సావిత్రి దంపతుల కుమారుడు లంకపల్లి నాగఫణికుమార్ (25) ఈ నెల 1న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాల వైపు పయనించాలి


బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమడోలు: విద్యార్థి దశ నుంచి చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని గుండుగొలను, ఆగడాల లంక హెచ్‌ఎంలు గారపాటి సునీత, మోహనరావులు అన్నారు. గుండుగొలను, ఆగడాలలంకలో శనివారం చైల్డ్‌రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా వీధి నాటక ప్రదర్శన చేశారు. క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శాంతి కల్చరల్ సొసైటీ కళాకారుల బృందం సభ్యులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలు, చదువు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వీధి నాటకం వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.కవిత, మహిళ కానిస్టేబుల్ పి.రాధిక, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


శక్తి యాప్ గురించి అవగాహన కల్పించి బ్యానర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

భీమడోలు: సైబర్ నేరాల ఉచ్చులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ప్రతి విషయంలోనూ యువత అప్రమత్తతతో మెలగాలని జిల్లా ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు అన్నారు. భీమడోలులో మాంటిస్సోరీ విద్యాసంస్థల అధినేత కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ వల్ల కలిగే ఉపయోగాలు, సైబర్ నేరాలపై అవగాహన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. వాటిపై ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, ప్రిన్సిపాల్స్ రాగాల ఆశోక్, పెచ్చెట్టి కేసరి, ఇన్‌చార్జి పెనుమూడి బాలు పాల్గొన్నారు.

5న ధర్నాను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

జంగారెడ్డిగూడెం: ఆదానీ స్మార్ట్ మీటర్లపై పెట్టే ఖర్చుతో ట్రూ అప్ చార్జీలు తగ్గిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రవి అన్నారు. ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సీపీఎం స్థానిక కార్యాలయంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జంపన వెంకటరమణరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో రవి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణలు మాట్లాడారు. ఈనెల 5న అశ్వరావుపేటరోడ్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఇప్పటికే రూ.3500 కోట్లు ప్రజలపై భారం వేశారని తెలిపారు. మళ్లీ వేల కోట్లు ఖర్చుపెట్టి స్మార్ట్ మీటర్లు కొనాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. ఆదాని స్మార్ట్ మీటర్లు ఉపసహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మానుకొండ జీవరత్నం, సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు, రైతు సంఘం నాయకులు శంకర్ రాధాకృష్ణ, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి మొల్లేటి శ్రీనివాస్, వంగ గోపి పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో సినీ నటుడు విరాజ్ సందడి


నటుడు విరాజ్ అశ్విన్‌తో గ్రామస్తులు

దెందులూరు: మండలంలోని ఉండ్రాజవరంలో బేబి సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ సందడి చేశారు. గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన అశ్విన్ కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. సినిమా పరిశ్రమలో ప్రవేశించిన తర్వాత ఇప్పటివరకు ఎనిమిది సినిమాల్లో నటించినట్లు ఆయన తెలిపారు. బేబీ సినిమా ద్వారా ఎక్కువ గుర్తింపు వచ్చిందన్నారు. బేబీ సినిమాకు సంబంధించి స్క్రీన్ ప్లే, ఒక పాటకు జాతీయ అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. అశ్విన్‌ను ఎంపీటీసీ సభ్యులు సున్నా నరేష్, జరజాపు శ్రీనివాసరావు, కనకల సూర్య, సున్నా రాంబాబు, గరక గంగాధర్ రావు, మద్దుల రాంప్రసాద్ తదితరులు అభినందించారు.

బెయిల్ మంజూరుపై హర్షం

దెందులూరు: వివిధ ఆరోపణల నేపథ్యంలో అరెస్టు చేసిన ఆర్‌సీఎం సిస్టర్లు వందన ఫ్రాన్సిస్, సిస్టర్ మేరీలకు బెయిల్ మంజూరు చేయడంపై ఆల్ ఇండియా పాస్టర్ ఫెడరేషన్ నేషనల్ సెక్రెటరీ, ఏపీ వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ జీవన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బెయిల్ మంజూరుతో న్యాయ వ్యవస్థ పై మరింత విశ్వాసం, గౌరవం పెరిగిందని పేర్కొన్నారు. త్వరలోనే సిస్టర్ల గురించి నిజానిజాలు బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అమ్మకాలకు గణపయ్యలు సిద్ధం


ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహం

గ్రామాల్లో ప్రత్యేక పూజలందుకునేందుకు గణపయ్యలు సిద్ధమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. భారీ ప్రతిమలను ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నారు. ఇప్పటికే విగ్రహాలకు ఆర్డర్ ఇచ్చేందు ముందుకు వస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు దూరప్రాంతాల నుంచి విగ్రహాలను మండలంలో అమ్మకానికి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం విగ్రహాల ధరలు సైజును బట్టి రూ.2500, నుంచి రూ.7 వేల వరకు ఉన్నాయి. – పెదవేగి


ఎలుక వాహనంపై బొజ్జ గణపయ్య



విక్రయానికి సిద్ధంగా ఉంచిన విగ్రహాలు


విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు